క్లుప్తంగా

నడివీధికి వచ్చిన అమ్మవార్లు


బొందాడ గ్రామంలో అమ్మవార్లను నడివీధికి తీసుకొస్తున్న దృశ్యం

కాళ్ల: మండలంలోని బొండాడ గ్రామంలో పోలేరమ్మ, మహాలక్ష్మమ్మ అమ్మవార్లను గురువారం నడివీధి కి తీసుకొచ్చారు. అమ్మవార్ల జాతర్ల మహోత్సవంలో భాగంగా అమ్మవార్లను నడివీధికి తీసుకొచ్చి భక్తులకు, గ్రామస్తులకు దర్శన భాగ్యం కలిగించారు. గ్రామ సర్పంచ్ మన్నే వరలక్ష్మి, నాగరాజు ఆధ్వర్యంలో అమ్మవార్ల వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు ఆలయ ఈవో వేగేశ్న ఆంజనేయరాజు తెలిపారు. ప్రతి ఏడాది అంగరంగ వైభవంగా అమ్మవారి జాతర నిర్వహిస్తామని ఉండి ఏఎంసీ మాజీ చైర్మన్ మన్నే నాగరాజు తెలిపారు. గ్రామ పెద్దలు భక్తులు సహకారంతో ఎంతో భక్తిశ్రద్ధలతో కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మన్నే శ్రీనివాస్, కండుల హనుమ, పెనుమత్స రంగరాజు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

రూ. 3.78 కోట్ల మిగులు అంచనా బడ్జెట్


స్థానిక నగర పంచాయతీ వార్షిక బడ్జెట్ వివరాల్ని తెలియజేస్తున్న చైర్‌పర్సన్ జామి హైమావతి

ఆకివీడు: స్థానిక నగర పంచాయతీ 2024–25 అంచనాల బడ్జెట్‌ను గురువారం కౌన్సిల్ సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో గత ఏడాది రూ. 88 లక్షల నిల్వతో ప్రారంభించి ఈ ఏడాది రావలసిన రూ. 18,60,28,500లు, వ్యయం రూ. 15,69,80,000 కోట్లుగా రూపొందించి మిగులు రూ. 3.78 కోట్లుతో అంచనాలు రూపొందించినట్లు చైర్‌పర్సన్ హైమావతి సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఆజెండాలోని ఇతర అంశాల్ని సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, వైస్‌చైర్మన్లు పుప్పాల వర్మ, నాగం జ్యోత్స్న, కమిషనర్ జీ.కృష్ణమోహన్, కౌన్సిల్‌సభ్యులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణ పనుల పరిశీలన


నక్కరాజుగుంటలో వాల్ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఉండి: రోడ్డు నిర్మాణాలతో గ్రామాభివృద్ధి సాధ్యమని సర్పంచ్ కమతం సోమశ్వేతారెడ్డి అన్నారు. గురువారం గ్రామంలోని నక్కరాజుగుంటలో గడపగడపకు మన ప్రభుత్వం నిధులతో చేపట్టిన రూ.10 లక్షలతో చేపట్టిన సీసీరోడ్లు, పంచాయతీ నిధులు రూ.3 లక్షలతో సీసీరోడ్డుకు రక్షణగా చేపట్టిన రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ఆధ్వర్యంలో నియోజకవర్గంలో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కమతం వెంకట్, వార్డు సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ వీరాస్వామి సేవలు అభినందనీయం


డాక్టర్ వీరాస్వామి దంపతులను సత్కరిస్తున్న అడిషనల్ డీఎంహెచ్‌వో భానునాయక్

భీమవరం(ప్రకాశం చౌక్): వైద్యుడిగా డాక్టర్ వీరాస్వామి అందించిన సేవలు అభినందనీయమని అడిషనల్ డీఎంహెచ్‌వో భానునాయక్ అన్నారు. భీమవరం ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన డాక్టర్ ఎం.వీరాస్వామి సత్కార సభ గురువారం ప్రభుత్వాస్పత్రిలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన భానునాయక్ డాక్టర్ వీరాస్వామి దంపతులను సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డాక్టర్ వీరాస్వామి 32 ఏళ్ల పాటు ప్రభుత్వ ఆస్పత్రుల్లో డాక్టర్‌గా పనిచేసి ప్రజలకు మంచి వైద్య సేవలు అందించారని ఆయన సేవలను కొనియాడారు.

పోలింగ్ బూత్‌ల్లో పక్కా ఏర్పాట్లు చేయాలి

తాడేపల్లిగూడెం రూరల్: పోలింగ్ బూత్‌ల్లో పక్కాగా అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆర్డీవో కే.చెన్నయ్య అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎన్నికల నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు.

రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ప్రభుత్వ విప్ శ్రీనివాస్


భీమవరంలో శ్రీనివాస్‌తో వైఎస్సార్‌సీపీ పట్టణ నూతన కమిటీ సభ్యులు

భీమవరం: రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పని చేస్తుందని ప్రభుత్వ విప్, భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. వైఎస్సార్‌సీపీ భీమవరం పట్టణ నూతన కమిటీ సభ్యులు గురువారం ఆయన క్యాంపు కార్యాలయంలో శ్రీనివాస్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రంధి మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చిన ఘనత జగన్‌దే దక్కుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిరంతరం ప్రజాసేవలోనే ఉందని అందువల్లనే భీమవరం నియోజకవర్గాన్ని రాష్ట్రస్థాయిలో ఆదర్శవంతంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా బలోపేతం కావాలనే సంకల్పంతో నవరత్న పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. గత పదేళ్ల కాలంలో దీర్ఘకాలిక సమస్యలనేకం పరిష్కరించామని మరెన్నో అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయన్నారు. పార్టీ కమిటీలకు ఎంపికైన నాయకులు రాబోయే ఎన్నికల్లో గతంలో కంటే ఎక్కువ మెజారిటీ విజయం సాధించడానికి సైనికుల్లా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు మోటుపల్లి గంగాధరరావు, పట్టణ అధ్యక్షుడు తోట భోగయ్య, ఉపాధ్యక్షులు గాదిరాజు రామరాజు, నరిసిపకల వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శులు మల్లుల శ్రీనివాసరావు, మాదిరెడ్డి శ్రీనివాస్, కంఠకట్ల నాగరాజు, కార్యదర్శులు కొప్పుల సత్తిబాబు, ముత్యాల బుజ్జి, కొత్తల కృష్ణ బాబు, గొట్టుముక్కల సుబ్బరాజు, బొర్రా వాసు, కోశాధికారి పులవర్తి సాయి, కార్యవర్గ సభ్యులు ముదునూరి స్వాతి సుబ్బరాజు, ఎండి ఇర్ఫాన్, పాలా సత్యనారాయణ, మోటుపల్లి కాశీ విశ్వనాథ్, ఉప్పులూరి సుధాకర్, బొల్లా, దర్శాడ్డ, వర్దనీడి సత్యనారాయణ, బాల వెంకట నరసమ్మ, పూజారి వెంకటలక్ష్మి, యడ్ల పుష్ప, కొండేటి సుధాకర్, కొమ్ము శ్రీను, మహమ్మద్ పాషా, పోదారి శ్రీను, రేవుల గడ్డ ఇజ్జాయిల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం


నిత్యాన్నదానానికి రూ లక్ష విరాళం అందజేసిన దాతలను సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): శ్రీ మావుళ్లమ్మ అమ్మవారు దేవస్థానంలో జరుగుతున్న నిత్యాన్నదానానికి గురువారం ఉండి మండలం యండగండి వాస్తవ్యులు నంబూరి సూర్యనారాయణ రాజు, సూర్యకుమారి దంపతులు రూ.లక్ష రూపాయలు విరాళంగా అందజేశారు. వారిని ధర్మకర్తలు, అసిస్టెంట్ కమిషనర్ ఘనంగా సత్కరించారు.

కలెక్టర్‌ను కలిసిన మాలమహానాడు నాయకులు


భీమవరంలో కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీతో మంగరాజు తదితరులు

భీమవరం: జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌గాంధీని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు, జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యుడు చీకటిమిల్లి మంగరాజు ఆధ్వర్యంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంగరాజు మాట్లాడుతూ పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద మెట్లు నిర్మించడానికి కృషిచేయాలని కోరారు. అలాగే పాలకోడేరు మండలం గరగపర్రు సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం పక్కన ఉన్న బస్టాండ్‌ను తొలగించాలని, ప్రతినెల 29, 30 తేదీల్లో నిర్వహించే పౌర హక్కుల దినం కార్యక్రమానికి తహసీల్దార్లతో పాటు మండలాధికారులంతా విధిగా పాల్గొనే విధంగా ఆదేశాలివ్వాలని కోరారు. ఆయన వెంట ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యుడు పొన్నమండ బాలకృష్ణ, బొమ్మనూరి వరప్రసాద్, వల్లూరి పెద్దిరాజు, వీరవల్లి సునీల్ కుమార్ తదితరులున్నారు.

వీఆర్‌వోల సంఘం చైర్మన్ అభినందన

గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం చైర్మన్ గుర్రం రాజు జిల్లా కలెక్టర్ సమిత్‌కుమార్‌గాంధీ అభినందించారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు మాట్లాడుతూ రెవెన్యూకు సంబంధించిన రీసర్వే నిర్వహించిన గ్రామాల్లో మ్యూటేషన్ విషయంలో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మిరియాల లక్ష్మీనారాయణ, గుమ్మళ్ల జకరయ్య, కేడీఎస్ కెనడీ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో పేదలకు భరోసా


డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజుకు కృతజ్ఞతలు తెలుపుతున్న జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి పాలు, పార్టీ నాయకులు

కాళ్ల: జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన నాటి నుంచి నేటి వరకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ పేదలకు అండగా నిలిచారని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు స్పష్టం చేశారు. కాళ్ల మండలం పెదఅమిరం పార్టీ క్యాంప్ కార్యాలయంలో పీవీఎల్ నరసింహరాజును జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి కురెళ్ళ పాలు, పార్టీ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శిగా తనను నియమించిన పీవీఎల్ నరసింహరాజుకు పాలు పుష్ప గుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పీవీఎల్ నరసింహరాజు మాట్లాడుతూ రాష్ట్రా అభివృద్ధికి, రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రి చేసుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరు పార్టీ గెలుపు కోసం సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఆయన రెండోసారి ముఖ్యమంత్రి అయితేనే ప్రజలకు మేలు చేకూరుతుందని విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. ప్రతిపక్ష నాయకులు ప్రజలకు మేలు చేసే ఆలోచన లేదని ఎద్దేవా చేశారు. ప్రజలకు జగన్‌మోహన్ రెడ్డికి ఉందని భీమా వ్యక్తం చేశారు. ప్రతిపక్ష నాయకుల కల్లబొల్లి హామీలు నమ్మేస్థితిలో ప్రజలు లేరని ఎవరైతే వారి ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తున్నారో వారికే పట్టం కడతారన్నారు. వలంటీరు, సచివాలయ వ్యవస్థల ద్వారా ప్రజలకు సేవలు అందజేస్తున్నారని చెప్పారు. పార్టీ నాయకులు ఆకివీడు జెడ్పీటీసీ వేగేశ్న వెంకటరాజు, ఆకివీడు మున్సిపాల్టీ వైస్ చైర్మన్ పుప్పాల పండు, జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షుడు అంబటి రమేష్, సిద్ధాపురం గ్రామ సర్పంచ్ చిగురుపాటి చిట్టిబాబు, సత్యనారాయణ రాజు పాల్గొన్నారు.

పరిశోధనలపై దృష్టి పెట్టాలి


భీమవరం విష్ణు కళాశాలలో ఆర్‌అండ్‌డీ లోగోను ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం: ఇంజినీరింగ్ విద్యార్థులు అకడమిక్ ప్రాజెక్టుల్లో ఎస్‌డీజీలతో అత్యాధునిక పరిశోధనలపై దృష్టి పెట్టాలని భీమవరం విష్ణు ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జి.శ్రీనివాసరావు అన్నారు. సూరిందారు. గురువారం కళాశాలలో ఆర్‌అండ్‌డీ ఫోకస్–2024 సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశ, విదేశాల్లో ఉన్నత విద్యాసంస్థలు బీటెక్ పరిశోధనలు ఎంతగానో సహాయపడతాయన్నారు. ఏఐఈఓఎస్ డీన్ డాక్టర్ రాజు మాట్లాడుతూ సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్‌ను సమగ్రపరిచే అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలతో ప్రకటనలను ఎంచుకోవడం ద్వారా అధ్యాపకులు, విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ముందుగా ఆర్‌అండ్‌డీ ఫోకస్–2024 లోగోను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శివకుమార్ కృష్ణన్, శ్రీనివాసరాజు, పురుషోత్తమరాజు, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భీమవరం అర్బన్: మండలంలోని గొల్లవానితిప్పలో విద్యుత్ ఉపకేంద్ర పరిధిలో శుక్రవారం వార్షిక మరమ్మతుల నిమిత్తం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీర్ అహ్మద్‌ఖాన్ గురువారం విలేకరులకు తెలిపారు. గొల్లవానితిప్ప, ఎల్‌వీఎన్ పురం (ఎఫ్ఎల్ సొసైటీ), పల్లిపాలెం, ఈలంపూడి, గూట్లపాడు, కొత్తపూసలమర్రు, దొంగపిండి, లోసరి, బరువాసిపేట, తోకతిప్ప, నాగేంద్రపురం, దెయ్యాలతిప్ప, రాయలంపూడి గ్రామాలతో పాటు లోసరి ఇండస్ట్రియల్ లైన్లకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని వివరించారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఘనంగా చెన్నమల్లేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠ


చెన్నమల్లేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠలో పాల్గొన్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్

ఉండి: మండలంలోని చెరుకువాడలో పార్వతీ సమేత, చెన్నమల్లేశ్వరస్వామి ఆలయ పునఃప్రతిష్ఠ కార్యక్రమాన్ని కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం ఈ కార్యక్రమానికి హాజరైన డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజును నిర్వాహకులు ఆలయ మర్యాదల పొమ్మన ఘనంగా ఆహ్వానం పలికారు. అనంతరం గ్రామ సర్పంచ్ కొండేటి సాంబశివరావు, గ్రామపార్టీ అధ్యక్షుడు కొండేటి సత్యనారాయణ ఆధ్వర్యంలో పీవీఎల్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తీర్థప్రసాదాలను స్వీకరించారు. పుల్లేటికుర్తి శేషుబాబుదీక్ష శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆలయ పునఃప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభం, ఆలయ శిఖర ప్రతిష్ఠ వంటి కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, జెడ్పీటీసీ రణస్తుల కనకదుర్గామహాలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ బొల్లా వెంకటేశ్వర్లు, స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లాటి అనిత, బాలం తులసీ, రాయి సతీష్, అంగర రాంబాబు, బాలాజీ, బొద్దు నాగన్న, బడుగు బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

విద్య ద్వారానే సమాజం అభివృద్ధి

వీరవాసరం: విద్య ద్వారానే సమాజం అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర విద్య, అభివృద్ధి సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ యనమల నాగార్జున యాదవ్ తెలిపారు. వీరవాసరం మండలం మధ్యాల రామక ప్రమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని నాడు-నేడు పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు విద్యాభివృద్ధి సైతం పెద్ద పీట వేస్తూ ఎంతో కొనియాడుతున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జుత్తిగ శ్రీనివాసు, శనివారపు ప్రసాదు, పీ.డీ మల్లేశ్వరరావు, వై.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌ను వినియోగించుకోవాలి


భీమవరంలో జాతీయ లోక్‌అదాలత్‌పై మాట్లాడుతున్న జడ్జి ధనరాజు

భీమవరం: జాతీయ లోక్‌అదాలత్‌ను ఈ నెల 16న నిర్వహించనున్నామని, భీమవరం 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో పెండింగ్‌లోని రాజీ పడదగిన క్రిమినల్, ఎక్సైజ్, చెక్‌బౌన్స్ కేసులు రాజీ చేసుకోవాలని 2వ అదనపు సివిల్ జడ్జి డి.ధనరాజు చెప్పారు. గురువారం తన ఛాంబర్‌లో పోలీస్ అధికారులు, కోర్టు రిప్రజెంటేటివ్స్‌తో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజీ పడదగిన కేసులను గుర్తించి బాధితులు, ముద్దాయిలకు తక్కువ సమయంలో న్యాయం జరిగేలా కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. క్రిమినల్ కేసులతో పాటు మనోవర్తి, భూతగాదాలు, చెక్‌బౌన్స్, ఎక్సైజ్ కేసులు కూడా రాజీ చేసుకోడానికి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో భీమవరం వన్‌టౌన్, టూటౌన్, ఉండి పోలీస్ స్టేషన్ల పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి


నాగరాజు

పాలకోడేరు: మార్చి 18వ తేదీ నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షలకు మండలంలో ఉన్న 11 ప్రభుత్వ పాఠశాలలు, రెండు ప్రైవేట్ పాఠశాలల నుంచి మొత్తం 645 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్నట్లు మండల విద్యాశాఖాధికారి 1 పెన్మెత్స వెంకట శివనాగరాజు తెలిపారు. వీరవాడలికి పాలకోడేరు, మోగల్లు, గొల్లలకోడేరు, విస్సాకోడేరు, శృంగవృక్షం ఉన్నత పాఠశాల్లో పరీక్షా కేంద్రాలను కేటాయించామన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాల్లో చదివే విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ప్రతి విద్యార్థి పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు తెలిపారు.

వైభవంగా ఆలయ పునఃప్రతిష్ఠ


పెనుగొండలో ఉమాసోమేశ్వర స్వామి ఆలయ పునః ప్రతిష్ఠ మహోత్సవం

పెనుగొండ: పెనుగొండలో ప్రసిద్ధ ఉమాసోమేశ్వర స్వామి ఆలయ పునః ప్రతిష్ఠ మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. వారం రోజులుగా నూతనంగా నిర్మించిన ఆలయం వద్ద హోమాలు, పూజలు, అభిషేకాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. గురువారం ఉదయం బ్రహ్మశ్రీ కేతవరపు వెంకటేశ్వరశర్మ బ్రహ్మత్వంలో వేద పండితుల చేతుల పవన శర్మ ఆధ్వర్యంలో ఉమాసోమేశ్వర స్వామికి, విఘ్నేశ్వర ప్రతిష్ఠాపన పూజలు, యంత్ర విగ్రహ, లింగాకుల, ధ్వజ ప్రతిష్ఠ, శాంతి కల్యాణం నిర్వహించారు. ప్రతిష్ఠాపన మహోత్సవాల్లో కమిటీ సభ్యులతో పాటు మాజీ మంత్రి, వైస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు, ఎంపీపీ పుతినీడి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు పోడూరి గోవర్ధన, సర్పంచ్ నక్కా శ్యామలాదేవి పాల్గొన్నారు. అనంతరం ఆలయ ఆవరణలో భారీ అన్న సమారాధన నిర్వహించారు.

నేడు వెలివర్రులో జగనన్న ఆరోగ్య సురక్ష

ఉండి: జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపు మండలంలోని వెలివర్రు గ్రామంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు చేతుల మీదుగా ప్రారంభిస్తారని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ముదునూరి కొండరాజు తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

మానవత్వాన్ని చాటుకున్న స్నేహితులు

ఆకివీడు: స్థానిక ఇల్లాపు వారి వీధిలో ఇటీవల అగ్ని ప్రమాదానికి కాలి బూడిదైన వైఎస్సార్‌సీపీ బూత్ కన్వీనర్, గృహసారథి పోతురాజు వెంకట రమణ, పుష్పవతి దంపతులు కట్టుబట్టలతో బయటపడ్డారు. ఇటీవల డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు రూ. 10 వేల నగదు, 50 కేజీల బియ్యం, నిత్యావసర వస్తువులు అందజేశారు. సంతోషకుమార్ అతని స్నేహితులు వెంకట రమణ స్నేహితులు మానవత్వాన్ని చాటుకుని రూ. 50 వేల విలువైన గృహోపకరణాలు, వంట సామాగ్రి, ఇతర వస్తువుల్ని గురువారం అందజేశారు. కష్టకాలంలో ఉన్నప్పుడు ఆదుకునేవాడే దేవుడని, కష్టంలోనే స్నేహం కలిసి రావాలని పలువురు స్నేహితులు కొంత సొమ్మును పోగు చేసి విలువైన సామగ్రిని కొనుగోలు చేసి అందజేయడం పట్ల పలువురు అభినందిస్తున్నారు.

భవన నిర్మాణ కార్మికుల క్లెయిమ్స్‌ను పరిష్కరించాలి

భీమవరం: భవన నిర్మాణ కార్మిక వెల్ఫేర్ బోర్డులో పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్స్‌ను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం భీమవరంలోని కలెక్టర్ కార్యాలయం వద్ద భవననిర్మాణ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌ఛార్జ్ రెవెన్యూ అధికారి బి.శివన్నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో చెల్లబోయిన రంగారావు, బొల్లా నాగరాజు, పోలిరాజు ఆదినారాయణ, కోడే సాయి బాలాజీ పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీలకు ఇన్‌చార్జ్ కార్యదర్శుల నియామకం

పాలకోడేరు: పాలకోడేరు గ్రామ పంచాయతీ ఇన్‌చార్జ్ కార్యదర్శిగా విస్సాకోడేరు సెక్రటరీగా ఉన్న బొక్కా జార్జి ప్రసాద్‌ను నియమించినట్లు పాలకోడేరు ఎంపీడీఓ టి.అనూరాధ తెలిపారు. అలాగే మోగల్లు పంచాయతీ కార్యదర్శి ఇన్‌చార్జిగా కొరుకొల్లు పంచాయతీ కార్యదర్శి బీవీఎస్ శ్యామ్‌కుమార్‌ను నియమించినట్లు ఎంపీడీఓ తెలిపారు. ఇప్పటి వరకు పాలకోడేరు, మోగల్లు గ్రామాల్లో పనిచేసిన కనుమూరి వెంకటరాజుపై పలు అభియోగాలు రావడంతో ఆయనను పోడూరు మండలం పండిత విల్లూరు గ్రామానికి బదిలీ చేశారు.

పల్స్ పోలియో కార్యక్రమంపై సమీక్ష

నరసాపురం: పల్స్ పోలియో కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు సూచించారు. గురువారం పల్స్ పోలియో కార్యక్రమంపై గురువారం మున్సిపల్ కార్యాలయంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. పట్టణంలో మొత్తం 40 పల్స్ పోలియో కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఆదివారం ఉదయం 7 గంటలు నుంచి సాయంత్రం 5 గంటలు వరకూ పోలియో చుక్కలు వేయాలన్నారు.

9న అమరావతిలో వికలాంగుల మహాగర్జన

పాలకొల్లు సెంట్రల్: అమరావతిలో ఈ నెల 9న నిర్వహించే వికలాంగుల మహాగర్జనకు లక్షలాదిగా తరలిరావాలని వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు పసుపులేటి దేవేంద్ర కోరారు. పాలకొల్లు ఏఎంసీ ఆవరణలో గురువారం వీహెచ్‌పీఎస్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వికలాంగుల మహా గర్జనకు మంద కృష్ణ మాదిగ పిలుపునిచ్చారన్నారు. జాతీయ కోర్ కమిటీ కో చైర్మన్ అందే రాంబాబు మాట్లాడుతూ అన్ని గ్రామాల నుంచి వీహెచ్‌పీఎస్ కార్యకర్తలు తరలిరావాలన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఎంఆర్‌పీఎస్, తదితరులు పాల్గొన్నారు.

నేడు రిజిస్ట్రేషన్ పట్టాల పంపిణీ

తాళ్లకోడు జగనన్న కాలనీలో 3,050 పట్టాలు పంపిణీ


తాళ్లకోడు జగనన్న కాలనీలో లబ్ధిదారులు సుందరంగా నిర్మించుకుంటున్న భవనాలు

ఆకివీడు: నియోజకవర్గంలో పేదలకు పంపిణీ చేసిన స్థల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ దాదాపుగా పూర్తి అయిందని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్.నర్సింహరాజు చెప్పారు. రిజిస్ట్రేషన్ పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని మండలంలోని తాళ్లకోడు గ్రామంలో గురువారం చేపడుతున్నామన్నారు. నాలుగు దశాబ్దాలుగా పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీ నియోజకవర్గంలో జరగలేదన్నారు. నిరుపేదలు ఇంటి స్థలం లేక కాల్వ గట్లు, మురుగు బోదెలు, రోడ్డు మార్జిన్లు, స్మశాన వాటిక ప్రాంతాల్లో కర్రల పందెళ్లు, గుడిసెలు వేసుకుని జీవనం గడుపుతుండేవారన్నారు. కనీస దరఖాస్తు అనుభవిస్తూ రెండ తరాలు జీవనం గడిపినప్పటికీ పేదలకు ఇళ్ల స్థలాల్ని గత ప్రభుత్వాలు పంపిణీ చేయలేదన్నారు. ఆకివీడు సమితిగా ఉన్న రోజుల్లో తన తండ్రి చైర్మన్ తిమ్మరాజు హయాంలో పేదలకు కాలనీలు ఏర్పాటు చేసి పట్టాలు ఇచ్చారని చెప్పారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి హయాంలో నియోజకవర్గ ఎమ్మెల్యే పాతపాటి సర్రాజు ఆధ్వర్యంలో గ్రామంలో పట్టాలు పంపిణీ చేశారని నర్సింహరాజు చెప్పారు. సీఎం జగన్ మోహన్ రెడ్డి 58 నెలల పరిపాలనలో కాలనీలన్నీ కొత్త గ్రామాలుగా వెలుస్తున్నాయని చెప్పారు. కాలనీలలో పేదలు పక్కా భవనాలు నిర్మించుకుంటున్నారని చెప్పారు. పేదలకు పట్టాలు ఇవ్వడమే కాకుండా వాటిని ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయించి అందజేస్తున్నామని తెలిపారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా పేదల పట్టాలకు హక్కు కల్పిస్తూ రిజిస్ట్రేషన్లు చేయడం చరిత్రాత్మకమన్నారు. సీఎం జగన్ తీసుకున్న సంచలనాత్మక నిర్ణయంతో పేదల లక్షాధికారులు అయ్యారన్నారు. పేదల పట్టా భూమి విలువ భారీగా పెరుగుతుందని చెప్పారు. నియోజకవర్గంలోని ఆకివీడు మండలం కుప్పనపూడి గ్రామ శివారు తాళ్లకోడులో జగనన్న కాలనీలో 3,450 మంది నిరుపేదలకు పట్టాలు పంపిణీ చేశామన్నారు. జిల్లాలోనే అత్యధికంగా పేదలకు పట్టాలు పంపిణీ చేసిన ఘనత ఉండి నియోజకవర్గానికి దక్కుతుందన్నారు. ప్రతి గ్రామంలో ప్రత్యేక కాలనీలు ఏర్పాటు చేసి వాటికి అన్ని వసతులు కల్పిస్తున్నారని చెప్పారు. అన్ని మండలాల్లో పేదల పట్టాల రిజిస్ట్రేషన్ పనులు 95 శాతంకు పైగా పూర్తి అయ్యాయన్నారు. నియోజకవర్గంలో మొట్టమొదటిసారిగా మార్చి 1వ తేదీన తాళ్లకోడులో రిజిస్ట్రేషన్ పట్టాల్ని పంపిణీ చేస్తున్నామని చెప్పారు. పట్టాల పంపిణీతో లబ్ధిదారుల్లో ఆనందం వెల్లివిరుస్తోందన్నారు.